
epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 01 | సంచిక : 48 | గురువారం | 06.06.2024



# ఎన్‌డీఏ పక్ష నేతగా మోడీ

- ఏకగ్రీవంగా ఎన్నుకున్న కూటమి
- 8 లేదా 9న ప్రధానిగా ప్రమాణం

**హైదరాబాద్, మన చౌరాస్తా :** జాతీయ ప్రజాస్వామ్య కూటమి పక్ష నేతగా నరేంద్ర మోదీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దిల్లీలో ప్రధాని మోదీ నివాసంలో బుధవారం జరిగిన సమావేశంలో ఈ మేరకు ఎన్‌డీఏ పక్షాల నేతలు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు ఆమోదించారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం చేపట్టిన ప్రజాసంక్షేమ విధానాల కారణంగా గత పదేళ్లలో దేశంలోని 140కోట్ల మంది ప్రజలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందినట్లు ఓ తీర్మానం ఆమోదించారు. ఈ సమావేశంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జేడీయూ నేత, బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్, శివసేన నేత, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే, ఎల్జేపీ నేత చిరాగ్ పాసవాన్, ఎన్‌సీపీ నేత ప్రఫుల్ పటేల్, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

### తీర్మానంలో ఎన్‌డీఏ కూటమి నేతలు

ఈనెల 8న లేదా 9వ తేదీన మూడోసారి మోదీ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దిల్లీ కర్తవ్యపథ్‌లో మోదీ ప్రమాణస్వీకారం చేయనున్నట్లు సమాచారం. 60 ఏళ్ల సుదీర్ఘ విరామం అనంతరం జవహర్‌లాల్ నెహ్రూ తర్వాత వరుసగా మూడోసారి ప్రధాని పదవి చేపట్టే నేతగా మోదీ రికార్డులకెక్కనున్నారు. 2014 ఎన్నికల్లో 282 స్థానాలు, 2019లో 303 సీట్లతో సొంతంగా మెజార్టీ సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన బీజేపీ, ఈసారి చార్ సౌ పార్ అంటూ నినదించినా మెజార్టీకి అవసమైన స్థానాలు సొంతంగా సాధించలేకపోయింది. 240స్థానాలతో అతిపెద్ద పార్టీగా అవతరించింది. మ్యాజిక్ ఫిగర్ 272 కంటే 32 స్థానాలు తగ్గాయి. దీంతో ఎన్‌డీఏ మిత్రపక్షాలకు చెందిన 53మంది ఎంపీల మిగతా2లో



టీ-20లో 4

## భారత్ బోణీ

# తొలి రౌండ్‌లో..



మల్లన్న **36,210**

రాకేశ్‌రెడ్డి **28,540**



- కొనసాగుతున్న ఎమ్మెల్సీ కౌంటింగ్
- కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్యే పోటీ
- మూడో స్థానంలో బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి

02



బీజేపీ కోసం బీఆర్‌ఎస్ 2

## ఆత్మబలిదానం

- సీఎం రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు



పర్యావరణ పరిరక్షణకు 3

## కృషి చేయాలి

- హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్



మొక్కల పెంపకం 4

## బాధ్యతగా తీసుకోవాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి రవీంద్రశర్మ

General News

# తొలి రౌండ్‌లో కాంగ్రెస్ ఆధిక్యం

- తీన్మార్ మల్లన్న వర్సెస్ రాకేశ్‌రెడ్డి
- కొనసాగుతున్న ఎమ్మెల్సీ కౌంటింగ్
- కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే పోటీ





**వరంగల్, మన చౌరాస్తా :** వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కౌంటింగ్ నల్లగొండ జిల్లా కేంద్రంలో కొనసాగుతోంది. గత నెల 27న నియోజక వర్గ పరిధిలోని 12 జిల్లాల్లో పోలింగ్ నిర్వహించారు. కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్), బీఆర్ఎస్ నుంచి రాకేశ్‌రెడ్డి, బీజేపీ నుంచి ప్రేమేందర్‌రెడ్డి పోటీ చేశారు. మొత్తం 52 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

మూడు ఉమ్మడి జిల్లాల్లో 605 పోలింగ్ స్టేషన్లలో నమోదైన ఓట్లను మూడు విడతలుగా లెక్కించే విధంగా ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు ప్రక్రియ సుదీర్ఘంగా కొనసాగనుంది. బ్యాలెట్ ఓట్లు కావడంతో ఫలితం వెలువడడానికి రెండు రోజులు సమయం పట్టే అవకాశం కనిపిస్తోంది. మొదటి ప్రాధాన్యత ఓట్లతో అభ్యర్థి గెలవకపోతే రెండో ప్రాధాన్యత ఓట్ల ద్వారా విజేతను ప్రకటిస్తారు. మొత్తం 96 టేబుళ్లపై ఓట్లు లెక్కిస్తున్నారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ కోసం 2,800 మంది అధికారులు, సిబ్బందిని నియమించారు. కౌంటింగ్ కేంద్రం దగ్గర 144 సెక్షన్ అమలులో ఉంది.

### ఒక్కో రౌండ్‌లో 48 వేల ఓట్లు...

ఒక్కో రౌండ్‌లో 48 వేల ఓట్ల లెక్కింపు జరుగుతుందని రిటర్నింగ్ అధికారి హరిచందన తెలిపారు. ఏడు రౌండ్లలో మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. మొదటి ప్రాధాన్యత ఓట్లలో ఫలితం తేలకపోతే.. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. నియోజకవర్గం పరిధిలోని 12 జిల్లాల్లో మొత్తం 4,63,839 మంది ఓటర్లు ఉండగా 72.44 శాతం ఓటింగ్ నమోదైంది. పోలైన ఓట్లు 3,36,013, పోస్టల్ బ్యాలెట్లు 2,139 నమోదైంది. ఓట్ల లెక్కింపునకు నాలుగు హాళ్లు ఏర్పాటు చేశారు. ఒక్కో హాల్లో 24 లెక్కింపు టేబుళ్ల చొప్పున మొత్తం 96 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఒక్కో రౌండ్లో 96 టేబుళ్లపై 96 వేల ఓట్లు లెక్కిస్తున్నారు. నాలుగు రౌండ్లలో తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తికానుంది. అర్ధరాత్రి లోపు తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తయ్యే అవకాశముందని భావిస్తున్నారు. తుది ఫలితం రావడానికి దాదాపు 36 గంటల సమయం పట్టే అవకాశం ఉన్నదని అధికారులు తెలిపారు. తొలి రౌండ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు 36,210 ఓట్లు రాగా, బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి 28,540 ఓట్లు వచ్చాయని అధికారులు తెలిపారు.

# బీజేపీ కోసం బీఆర్ఎస్ ఆత్మబలిదానం

- ఓట్లను బదలాయించారు
- మోడీని ప్రజలు తిరస్కరించారు
- బీజేపీ, బీఆర్ఎస్ ఇప్పటికైనా తీరు మార్చుకోవాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, మన చౌరాస్తా :** తెలంగాణలో బీజేపీని గెలిపించేందుకు బీఆర్ఎస్ నాయకులు ఆత్మ బలిదానం చేసుకుని అవయవదానం చేశారని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సంతోషకరమైన ఫలితాలు వచ్చాయన్నారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ద్వారా దేశవ్యాప్తంగా ప్రజాస్వామికవాదులను ఏకం చేశారని కొనియాడారు. 2023 శాసనసభ ఎన్నికల్లో 39.5 శాతం ఓట్లతో ప్రజాపాలనకు ప్రజలు ఆమోదం తెలిపారని.. వంద రోజుల్లో 5 గ్యారంటీలను అమలు చేసి పార్లమెంట్ ఎన్నికల బరిలో దిగామని చెప్పారు. ఈ ఎన్నికలు మా వంద రోజుల ప్రజా పాలనకు రెఫరెండం అని ముందే విస్పష్టంగా చెప్పామని గుర్తు చేశారు. 17 పార్లమెంట్ స్థానాల్లో 8 స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకుందని.. ఈ ఎన్నికల్లో 41 శాతం ఓట్లు కాంగ్రెస్ కు వచ్చాయని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 39.5 శాతం ఓట్లు వచ్చాయని.. ఈ ఎన్నికల్లో ఓట్ల శాతం పెరిగిందని వెల్లడించారు. తమ పరిపాలనపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఈ ఫలితాలతో అర్థమవుతోందన్నారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో గెలిపించి ప్రజలు మాకు మరో సీటు అదనంగా ఇచ్చారని అన్నారు. 2019లో బీజేపీ 4 సీట్లు గెలిస్తే.. ఈ ఎన్నికల్లో 8 స్థానాలు గెలుచుకుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో 20 శాతం ఉన్న ఓట్ల శాతం ఈ ఎన్నికల్లో 35 శాతానికి పెరిగాయని చెప్పారు. బీజేపీని గెలిపించేందుకు బీఆర్ఎస్ నాయకులు ఆత్మ బలిదానం చేసుకున్నారన్నారు. బీజేపీ గెలిచిన స్థానాల్లో బీఆరెస్ 7 సీట్లలో డిపాజిట్లు కోల్పోయిందని.. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో సిద్దిపేటలో హరీష్ తమ ఓట్లను పూర్తిగా బీజేపీకి బదిలీ చేశారని ఆరోపించారు. రఘునందన్ రావుకు ఓట్లను బదిలీ చేసి మెదక్ పార్లమెంట్ స్థానంలో బలహీన వర్గాల బిడ్డను ఓడించారని అన్నారు. వెంకట్ రామ్ రెడ్డిని నమ్మించి మోసం చేసి మరీ కేసీఆర్ బీజేపీని గెలిపించారని ధ్వజమెత్తారు. అసెంబ్లీ ఎన్నికల్లో 37.5 శాతం ఓట్లు పొందిన బీఆర్ఎస్ ఈ ఎన్నికల్లో 16.5 శాతానికి పడిపోయిందని అన్నారు. 2023లో 13శాతం ఓట్లున్న బీజేపీకి.. ఈ ఎన్నికల్లో 35.5 శాతంకు ఓట్లు పెరిగాయని చెప్పారు. రాష్ట్రంలో బీఆరెస్ ఎమ్మెల్యేల ఆత్మ గౌరవాన్ని కేసీఆర్, కేటీఆర్, హరీష్ బీజేపీకి తాకట్టు పెట్టారని విమర్శించారు. పూర్తిగా ఓట్లను బదలాయించి కేసీఆర్ రాజకీయ ఆరాచకానికి పాల్పడ్డారని మండిపడ్డారు. రాష్ట్రంలో తనంతట తానే అంతర్ధానం అయ్యి బీజేపీకి కేసీఆర్ మద్దతుగా నిలిచారని.. బూడిదైన బీఆరెస్ మళ్లీ పుట్టేది లేదన్నారు. వందరోజుల్లోనే మాపై ఆరోపణలు చేసిన బీఆరెస్ కు ప్రజలు బుద్ధి చెప్పారని పేర్కొన్నారు. కుట్ర పూరితంగా వ్యవహరించిన బీఆర్ఎస్ ను ప్రజలు తిరస్కరించారని చెప్పారు. ఇప్పటికైనా వ్యవహార శైలి మార్చుకోవాలని బీఆర్ఎస్‌కు సూచించారు. మోడీ గ్యారెంటీ పేరుతో బీజేపీ నేతలు ఈ ఎన్నికల్లో ప్రజల్లోకి వెళ్లారని.. అయినా బీజేపీ 303 సీట్ల నుంచి 243కి పడిపోయిందని అన్నారు. మోడీ గ్యారెంటీకి వారంటీ చెల్లిపోయిందని ప్రజలు తీర్పు ఇచ్చారని రేవంత్ పేర్కొన్నారు. దేశ ప్రజలు మోడీని తిరస్కరించారని.. తక్షణమే మోడీ ప్రధాని పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల తిరస్కరణకు గురైన మోడీ మళ్లీ ప్రధాని పదవి చేపట్టకూడదన్నారు. విలువలు కలిగిన నాయకుడిగా హుందాగా తప్పుకుంటే మోడీకి గౌరవం ఉంటుందని సూచించారు. ఇప్పటికైనా బీజేపీ అప్రజాస్వామిక తీరును మార్చుకోవాలని సూచించారు. ఇప్పటివరకు 18 గంటలే పనిచేశామని.. ఇకనుంచి మరో రెండు గంటలు ఎక్కువ పనిచేస్తామని చెప్పారు. రాష్ట్రంలో గెలుపు, ఓటములకు పూర్తి బాధ్యత తనదేనని.. వచ్చిన ఫలితాలు ఉగాది పచ్చడిలాంటివని పేర్కొన్నారు.

# ఎన్‌డీఏ పక్ష నేతగా మోడీ

(మొదటి పేజీ తరువాయి)

మద్దతుతో ప్రధాని మోదీ మూడోసారి హస్తిన పగ్గాలు చేపట్టనున్నారు.

### ఖర్గే ఇంట్లో 'ఇండియా' సమావేశం

మరోవైపు ఇండియా కూటమి నేతలు సైతం తదుపరి వ్యూహంపై చర్చించేందుకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే నివాసంలో భేటీ అయ్యారు. రాజ్యాంగ విలువలను కాపాడే నిబద్ధత ఉన్న పార్టీలను కూటమిలోకి స్వాగతిస్తున్నట్లు ఖర్గే చెప్పారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో తాము ఐక్యంగా, కృతనిశ్చయంతో పోరాడామని పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలు ప్రధాని మోదీకి స్పష్టమైన నైతిక పరాజయమనీ, వ్యక్తిగతంగా, రాజకీయంగా ఆయనకు భారీ నష్టమని తెలిపారు. ప్రజా తీర్పు మోదీకి, ఆయన రాజకీయ శైలికి వ్యతిరేకంగానే వచ్చిందన్నారు. ప్రజల అభీష్టాన్ని తారుమారు చేయాలని మోదీ నిర్ణయించుకున్నారని ఖర్గే విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతోపాటు శరద్ పవార్, స్టాలిన్, చంపయీ సోరెన్, తేజస్వీ యాదవ్, సీతారాం ఏచూరి, రాఘవ్ చడ్డా, కల్పనా సోరెన్ సహా ఇతర ముఖ్యనేతలు సమావేశానికి హాజరయ్యారు.



# సీఎంను కలిసిన నేతలు

**పాలకుర్తి, మన చౌరాస్తా :** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని బుధవారం హైదారాబాద్ లోని వారి నివాసంలో వరంగల్ పార్లమెంట్ స్థానం కైవసం చేసుకున్న సందర్భంగా మంత్రులు, ఎమ్మెల్యేలు కలిశారు. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, కాంగ్రెస్ నాయకులతో కలిసి పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, జనగామ డీసీసీ ప్రెసిడెంట్ , ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కలిసిన వారిలో ఉన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పాలకుర్తి నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీ అందించినందుకు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డిలను సీఎం అభినందించారు.



# యువతి దారుణహత్య

**కాజీపేట, మన చౌరాస్తా :** కాజీపేట మండలంలో యువతి దారుణహత్యకు గురైంది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కాజీపేట మండల శివారు అమ్మవారిపేట లోని సాయినాథ్ రియల్ ఎస్టేట్ వెంచర్ (భట్టుపల్లి నుండి ఉర్సుగుట్ట వెళ్లే దారి) లో సుమారు 30ఏళ్ల వయస్సుగల యువతిని దుండగులు హత్యచేశారు. యువతి ముఖంపై బండరాళ్ళతో కొట్టి చంపిన ఆనవాళ్ళు ఉన్నాయి. ముఖం పూర్తిగా నుజ్జయింది. ఘటనా స్థలంలో యువతికి చెందిన బ్యాగ్, చెప్పులు.. ఇతరత్రా ఆనవాళ్లను పోలీసులు స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. నిందితులకు శిక్ష విధించాలని స్థానికులు కోరుతున్నారు.

# పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

## హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్




**హనుమకొండ, మన చౌరాస్తా :** పర్యావరణ పరిరక్షణకు స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, సామాన్యులు కృషి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. బుధవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్స్ లో ప్రాంతీయ కాలుష్య నియంత్రణ మండలి ప్రపంచ పర్యావరణ దినోత్సవం లో నేల పునరుద్ధరించడం, ఏడారీకరణను నిరోధించడం, కరువును తట్టుకోవడం అనే అంశంతో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ మొక్కలను నాటారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మానవాళి అవసరాల కోసం చేపడుతున్న చర్యలు భూమి, నీరు, గాలి పర్యావరణ వ్యవస్థలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని, ముఖ్యంగా ఒకసారి ఉపయోగించి పారవేసే ప్లాస్టిక్ తో భూమి లోని నీరు చేరకుండా అడ్డు తగులుతున్నాయని అన్నారు. దీంతో భూమి నిస్సారం అవుతుందని, దీనినీ మనం కట్టడి చెయ్యాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర సచివాలయం లో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ప్లాస్టిక్ ను వాడకుండా చర్యలు తీసుకున్నారని, అలాగే హనుమకొండ కలెక్టరేట్ సముదాయం లో ప్లాస్టిక్ నీళ్ళ బాటిల్ లను, ఇతర ప్లాస్టిక్ వస్తువులను ఉపయోగించకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు కాలుష్య నియంత్రణ మండలి ఎలాంటి చర్యలు తీసుకోవాలో ప్రణాళికలు తయారు చెయ్యాలని సూచించారు. గత పది సంవత్సరాల నుండి తెలంగాణ ప్రభుత్వం చెట్లు పెంచే కార్యక్రమం చేపట్టి విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మనందరం జిల్లా లో గ్రీనరీ ని వృద్ధి చెయ్యడానికి కృషి చెయ్యాలని అన్నారు. సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు, ఇతరుల చే పతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డి.ఎఫ్.ఓ లావణ్య, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సునీత, అధికారులు పాల్గొన్నారు.

# మొక్కల పెంపకం బాధ్యతగా తీసుకోవాలి



**జనగామ, మన చౌరాస్తా :** మొక్కల పెంపకాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని జిల్లా న్యాయ సేవ అధికారి సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రవీంద్రశర్మ అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలను పెంచడం వల్ల వాతావరణంలో అధిక ఉష్ణోగ్రత తగ్గి చల్లదనం ఏర్పడుతుందన్నారు. ఆక్సిజన్ పెరగడం వల్ల ఆరోగ్యవంతులు అవుతాన్నారు. పండ్ల చెట్లను నాటడం వలన ఆ చెట్ల పైన ఆధారపడిన పక్షులు, చిన్నచిన్న జంతువులు బతుకుతాయన్నారు. ప్రకృతిలో కొన్ని ప్రాణులను రక్షించిన వాళ్లం అవుతామన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ ఇ.సుచరిత, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ సందీప, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చంద్రఋషి, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ వెంకట్రామ్ నరసయ్య పాల్గొన్నారు.

# యూట్యూబ్‌లో సందడి చేస్తున్న 'జనగామ కలం గళం'




**జనగామ, మన చౌరాస్తా :** సీసీసీ జనగామ (కల్చరల్ క్రియేటివ్ ఛానల్ జనగామ) అధ్వర్యంలో ఇటీవల యూట్యూబ్ ఛానల్ లో విడుదల చేసిన 'జనగామ కలం గళం' కవులు కళాకారుల సందడే సందడి అనే ప్రత్యేక కార్యక్రమం సందడి చేస్తుంది. జనగామ కవులు కళాకారుల ఐక్యవేదిక సహకారంతో సుమారు 20 మంది కవులు కళాకారులతో రూపొందించిన ఈ కార్యక్రమం పెట్లోజు సోమేశ్వరాచారి, అయిలా సోమనర్సింహచారి వ్యాఖ్యతలుగా వ్యవహరించి కొనసాగించగా జి.కృష్ణ సమన్వయకర్తగా వ్యవహరించారు. కల్నల్ డాక్టర్ మాచర్ల భిక్షపతి ప్రారంభంలో మంచి సందేశాన్ని అందించారు. జనగామ కేంద్రంగా ప్రారంబించిన సీసీసీ జనగామ యూట్యూబ్ ఛానల్ కార్యక్రమాలను ప్రతి ఒక్కరు వీక్షించి షేర్, లైక్, సబ్‌స్క్రైబ్, కామెంట్ చేయాలని నిర్వాహకులు బుధవారం జనగామలో విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డీఓపీ నేనావత్ దశరథ్ నాయక్, జనగామ కవులు, కళాకారులు లగిశెట్టి ప్రభాకర్, టి.రామచంద్రం, మల్యాల జనార్దన్ చారి, గౌలుసుల ఎల్లయ్య, అంబాల శివనాద్ గౌడ్, కోడం కుమారస్వామి, బుదారపు లావణ్య, వసంత, రేణుకుంట్ల మురళి, చిలుమోజు సాయికిరణ్, బహుజన నిరోషా, కె.జగదీశ్వరి, డాక్టర్ వేముల సదానందం, పొట్టబత్తిని భాస్కర్, గడ్డం మనోజ్ కుమార్, రంగరాజు ప్రసాద్, రాగల్ల డప్పు నరేష్ పాల్గొన్నారు.



# 'చామల' విజయంపై ధర్మకంచలో సంబురాలు

**జనగామ, మన చౌరాస్తా :** భువనగిరి ఎంపీగా చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపొందడంపై బుధవారం ధర్మకంచలోని 13వ వార్డులో కాంగ్రెస్ నాయకులు సంబురాలు చేసుకున్నారు. ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ మేడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగామ నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను సమయత్వం చేసి ఒక్క తాటిపై నడిపించి పార్టీ బలపరిచిన అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి గెలుపునకు బాటలు వేసిన డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొమ్మూరి ప్రశాంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంలోనే జనగామ పట్టణంలోని ధర్మకంచ 13వ వార్డులోని 263లో గల బూతులో 605 ఓట్ల మెజార్టీ ఇచ్చిన వార్డు ప్రజలకు పార్టీ పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ 13వ వార్డు అధ్యక్షుడు మిద్దెపాక స్టాలిన్ తోపాటు యూత్, మహిళా కాంగ్రెస్, ఎస్సీ, బీసీ సెల్ నాయకులు పాల్గొన్నారు.






# పొట్టి కప్‌లో భారత్ బోణీ

## ఐర్లాండ్‌పై టీం ఇండియా ఆల్‌రౌండ్ షో




**మన చౌరాస్తా, క్రీడావిభాగం:** 2024 టీ20 వరల్డ్ కప్‌లో టీమ్ఇండియా బోణీ కొట్టింది. న్యూయార్క్ వేదికగా ఐర్లాండ్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో టీమ్ఇండియా 8 వికెట్ల తేడాతో నెగ్గింది. ఐర్లాండ్ నిర్దేశించిన 97 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని భారత్ 2 వికెట్లు కోల్పోయి 12.2 ఓవర్లలో సునాయసంగా ఛేదించింది. కెప్టెన్ రోహిత్ శర్మ (52 పరుగులు: 37 బంతుల్లో: 4x4, 3x6) హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. రిషభ్ పంత్ (36* పరుగులు) రాణించాడు. ఐర్లాండ్ బౌలర్లలో మార్క్ అదైర్, బెంజామిన్ వైట్ చెరో 1 వికెట్ దక్కించుకున్నారు.

### రోహిత్- విరాట్ జోడీ:

అందరూ అన్నట్లుగానే ఈ మ్యాచ్‌లో రోహిత్‌తో కలిసి విరాట్ కోహ్లి ఇన్నింగ్స్ ప్రారంభించాడు. దీంతో ఈ స్టార్ జోడీయే మ్యాచ్ ముగిస్తుందని అనుకున్నారు. కానీ, మూడో ఓవర్లో భారీ షాట్‌కు ప్రయత్నించిన విరాట్ క్యాచౌట్‌గా పెవిలియన్ చేరాడు. దీంతో 22 పరుగులకే తొలి వికెట్ కోల్పోయింది. ఇక వన్‌డౌన్‌లో దిగిన పంత్‌తో రోహిత్ స్కోర్ బోర్డును ముందుకు నడిపించాడు. ఆ పిచ్‌పై ఇతర బ్యాటర్లు సింగిల్స్ తీయడానికి కష్టపడుతుంటే రోహిత్ బౌండరీలతో అలరించాడు. ఈ క్రమంలో టీ20ల్లో 30వ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇక 52 పరుగుల వద్ద రిటైర్డ్ హర్ట్‌గా రోహిత్ క్రీజును వదిలాడు. చివర్లో సూర్య భారీ షాట్‌కు యత్నించి ఔటయ్యాడు. తర్వాత పంత్ మ్యాచ్ ముగించాడు.

### రోహిత్ @4000


రోహిత్ శర్మ టీ20ల్లో 4 వేల పరుగులు పూర్తి చేసుకున్నాడు. 26 పరుగులు వ్యక్తిగత స్కోర్ వద్ద రోహిత్ ఈ మైలురాయి అందుకున్నాడు. ఇప్పటి వరకు రోహిత్ టీ20ల్లో 4026 పరుగులు బాదాడు. ఈ క్రమంలో టీ20ల్లో అత్యధిక పరుగులు బాదిన టాప్ 2 బ్యాటర్‌గా నిలిచాడు. విరాట్ కోహ్లి (4038) టాప్‌లో ఉండగా పాక్ బ్యాటర్ బాబర్ ఆజమ్ (4023) మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. ఇక ఈ మ్యాచ్‌లో రోహిత్ 1000 టీ20 వరల్డ్ కప్ పరుగులు కూడా పూర్తి చేసుకున్నాడు.

### అక్షర్ @50

స్పిన్నర్ అక్షర్ పటేల్ అరుదైన ఘనత సాధించాడు. ఈ మ్యాచ్‌లో ఒక వికెట్ దక్కించుకున్నాడు. ఈ క్రమంలో అక్షర్ టీ20ల్లో 50 వికెట్లు పూర్తి చేసుకున్నాడు. ఇప్పటివరకు 53 మ్యాచ్‌ల్లో 50 వికెట్లు పడగొట్టాడు. 39 అత్యుత్తమ ప్రదర్శన.



# పవన్ జర్నీపై 'అఖిరా' వీడియో



**మన చౌరాస్తా, సినిమా :** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో పవన్ కల్యాణ్ నేతృత్వంలోని జనసేన ప్రభంజనం సృష్టించింది. పవన్ తో సహా గాజు గ్లాసు మీద పోటీ చేసిన మొత్తం 21 మంది అభ్యర్థులు ఘన విజయం సాధించారు. అలాగే 2 ఎంపీ సీట్లను కూడా జనసేన కైవసం చేసుకుంది. దీంతో దేశవ్యాప్తంగా పవన్ కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఇక సినీ పరిశ్రమ నుంచి చిరంజీవి, అల్లు అర్జున్, రామ్ చరణ్, సాయి ధరమ్ తేజ్, మహేశ్ బాబు, రవితేజ తదితరులు పవన్ కు విషెస్ తెలిపారు. రేణు దేశాయ్ కూడా పవన్ కు అభినందనలు తెలిపింది. 'పవన్ కల్యాణ్ విజయంతో ఆద్య, అకిరాలు చాలా సంతోషంగా ఉన్నారని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు ఈ తీర్పు తో ప్రయోజనం పొందుతారని ఆశిస్తున్నాను' అంటూ మాజీ భర్త విజయాన్ని స్వాగతించింది. ఇక పవన్ జర్నీపై ఆయన కుమారుడు అఖిరా నందన్ ఒక స్పెషల్ వీడియో చేశాడు. ఖుషి నుంచి భీమ్లా నాయక్ వరకు పవన్ కల్యాణ్ పవర్ ఫుల్ డైలాగ్స్, ఇంటెన్స్ సీన్స్ అన్నింటిని కలిపి ఈ వీడియోను ఎడిట్ చేసి రూపొందించారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. అకిరా నందన్ ఎడిట్ చేసిన ఈ వీడియో అభిమానులకు గూస్‌బంప్స్ తెప్పిస్తోంది. కాగా కొన్ని రోజుల క్రితం 'అకిరా వాళ్ల నాన్న కోసం చేసిన వీడియో' అంటూ ఈ విషయాన్ని సోషల్ మీడియాలో షేర్ చేసింది రేణూ దేశాయ్.